క్లుప్తంగా

మోతె తహసీల్దార్‌గా వెంకన్న


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎం.వెంకన్న

మోతె : మోతె మండల తహసీల్దార్ ఎం.వెంకన్న శనివారం బాధ్యతలు స్వీకరించారు. వెంకన్న జనగామ జిల్లా నుంచి బదిలీపై మోతె మండలానికి వచ్చారు. మోతె ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పని చేసిన శ్రీకాంత్ గతంలో ఆయన పనిచేసిన సూర్యాపేట ఆర్డీఓ ఆఫీస్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. మండలంలో ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు.

బీరువా బహూకరణ


బీరువా అందజేస్తున్న కొమ్ము రమేష్

నడిగూడెం : మండలంలోని వల్లాపురం గ్రామంలో గల వైద్యశాఖకు గ్రామానికి చెందిన కొమ్ము రమేష్ తన తండ్రి కొమ్ము దానియేలు జ్ఞాపకార్థం శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రూ.10 వేల విలువైన బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా దాత రమేష్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం రమ, ఆశా కార్యకర్తలు ప్రమీల, నసీమా, సుశీల పాల్గొన్నారు.

భారతదేశ పటం నమూనా నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎంఈఓ సైదానాయక్

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న భారతదేశ పటం నమూనా పునర్నిర్మాణానికి శనివారం ఎంఈఓ సైదానాయక్ శంకుస్థాపన చేశారు. పూర్వ విద్యార్థి గౌర్రె సదానందరెడ్డి ఆర్థిక సహకారంతో ఈ నిర్మాణం చేపడుతున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు చామకూరి గురుపాదం, ఆకుల రాము తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డు టీచర్లు ఎస్.నరేందర్ రెడ్డి, ఎంఎస్ఎన్ రాజు, 1985–86 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు జి.వెంకటేశ్వర్లు, ఎం.ధనేష్, వి.శ్రీను, జె.శ్రీను, దామోదరాచార్యులు, ఆర్.మురళి, ఎస్.భిక్షపతి, కె.శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కోట య్య, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్ఐ రవీందర్

నేరేడుచర్ల : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ సూచించారు. శనివారం నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు డ్రగ్స్, సైబర్ నేరాలపై షీటీమ్స్ ఆధ్వర్యంలో పోలీస్ కళా బృందంచే నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డుల వివరాలు, ఓటీపీ వివరాలు ఇతరులకు చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పుట్లూరి సత్యనారాయణరెడ్డి, పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, ఆర్‌పీలు సత్యనారాయణరెడ్డి, శ్రీధర్, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, షఫీ, రవీందర్‌రెడ్డి, పోలీస్ కళా బృందం యల్లయ్య, గోపయ్య, నాగార్జున, చారి, కృష్ణ, గురులింగంతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

గరిడేపల్లి: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గరిడేపల్లి మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండల కేంద్రానికి చెందిన ప్రధాని వెంకన్న గుండాలమిట్ట ప్రాంతం నుంచి గరిడేపల్లికి వస్తుండగా.. గరిడేపల్లి మండల కేంద్రంలోని గుండాలమ్మ దేవాలయం సమీపంలో యూటర్న్ వద్ద హుజూర్‌నగర్ నుంచి నేరేడుచర్ల వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకన్న కాలు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామపంచాయతీ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శనివారం బీజేపీ కోదాడ నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణ కుమార్తె కనగాల దివ్య పుట్టినరోజు సందర్భంగా ఆర్థిక సహకారంతో పాటు వృద్ధులు, మానసిక వికలాంగులకు అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాతల కుటుంబసభ్యులు, ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

మురికికూపంగా నయానగర్

- కోదాడ పట్టణ నడిబొడ్డున పారిశుద్ధ్యం అస్తవ్యస్తం
- చిన్నపాటి వానకే కుంటను తలపిస్తున్న ఖాళీ స్థలం
- కొబ్బరిబోండాలు, వ్యర్థాలు పోస్తున్నా పట్టించుకోని అధికారులు


కోదాడ పట్టణంలోని నయానగర్‌లో అధ్వానంగా ఖాళీ స్థలం

కోదాడ : పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి కోదాడ పట్టణ ప్రజల నిత్యం నరకం చూస్తున్నారు. చిన్న వర్షానికే పట్టణంలోని ప్రధాన కూడళ్లు మురికి కూపాలుగా మారి దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ తిరిగి చెత్త సేకరిస్తున్నప్పటికీ పట్టణంలో ఎక్కడ చూసిన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. కొబ్బరి బోండాలను ఎక్కడ పడితే అక్కడ పోస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. మున్సిపాలిటీ సిబ్బంది కూడా డంపింగ్ యార్డుకు తరలించాల్సిన చెత్తను అక్కడ వరకు తీసుకెళ్లకుండా రోడ్ల వెంటే డంపు చేస్తున్నారని, ఇలా చేస్తూ డీజిల్ మిగుల్చుకుని సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలున్నాయి.

కొబ్బరి బోండాల పారబోత..

కోదాడ పట్టణ నడిబొడ్డున అనంతగిరి రోడ్డులో ఉన్న ఖాళీ స్థలంలో వర్షపునీరు నిలిచి మురికి కూపంగా మారింది. మున్సిపల్ సిబ్బంది సమీపంలోని చెత్తను తీసుకొచ్చి ఇక్కడే డంప్ చేస్తుండడంతో పరిస్థితి ఇంకా అధ్వానంగా తయారైంది. కొద్దిరోజుల క్రితం సమీపంలోని వ్యాపారులు కొబ్బరి బోండాలను కూడా ఇక్కడే వేస్తున్నారని, దీనిపై ఫిర్యాదు చేసినా మున్సిపాలిటీ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. ఇక్కడ పలు పాఠశాలలు, కళాశాలలు ఉండడంతో నిత్యం విద్యార్థులు తిరుగుతుంటారని, ప్రతి వర్షాకాలంలో తీవ్ర ఇబ్బంది ఎదురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ప్లాట్ యజమానితో మాట్లాడి నీరు నిలవకుండా చూడాలని చెప్పినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

వ్యర్థాలతో మూగజీవాలకు ముప్పు..

అనంతగిరి రోడ్డులోని ఖాళీ స్థలంలో వేస్తున్న వ్యర్థ పదార్థాల కోసం పశువులు నిత్యం ఇక్కడకు వస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్లలో వ్యర్థాలు వేస్తుండడంతో వ్యర్థాలతో పాటు పశువులు ప్లాస్టిక్‌ను కూడా తిని తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నాయి. ఈ పశువులు రోడ్డు మీద, మురికి కూపంలో పడుకోవడంతో వ్యాధుల భారీన పడుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాలను వెంటనే అక్కడి తొలగించి మూగజీవాలను రక్షించాల్సిన అవసరం ఉందని నయానగర్‌వాసులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



కోదాడ పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే అనంతగిరి రోడ్డులో చెత్త, కొబ్బరి బోండాలు, నిలిచిన నీటితో మురికి కూపంగా మారిన ప్రాంతాన్ని బాగు చేయాలి. అక్కడ నీరు నిలవకుండా చూడాలి. కొబ్బరి బోండాల వల్ల దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. మున్సిపల్ అధికారులు దీనిపై వెంటనే స్పందించాలి.

– రాయపూడి చిన్ని, నయానగర్

ప్రభుత్వంలో గౌడ కులస్తులకు ప్రత్యేక స్థానం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


మఠంపల్లి : కంఠమహేశ్వరస్వామికి పూజలు చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వంలో గౌడ కులస్తులకు ప్రత్యేక స్థానం ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మఠంపల్లి మండల కేంద్రంలో గౌడ కులస్తులు నూతనంగా నిర్మించిన శ్రీకంఠమహేశ్వరస్వామి దేవాలయంలో శనివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్ గౌడ్, రవాణా శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్‌గౌడ్ లతో పాటు ఎంతో మంది గౌడ నేతలకు గుర్తింపు ఇచ్చిందన్నారు. హుజూర్‌నగర్‌లో మాజీ ఎంపీ ధర్మభిక్షం భవన్ పేరుతో నిర్మించిన కౌండిన్య ఫంక్షన్ హాల్‌కు తాను మంత్రిగా గతంలోనే రూ.19 లక్షల నిధులు మంజూరు చేయించి ఆనాటి సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డితో శంకుస్థాపన చేయించిన విషయం గుర్తుచేశారు. తాను పుట్టిపెరిగిన తాటిపాముల గ్రామంలో అధికంగా తాటి చెట్లు, గౌడ సామాజిక వర్గం ఉండటం మూలంగానే గ్రామానికి ఆపేరు వచ్చిందని తెలిపారు. తనకు చిన్నతనం నుంచే గౌడ్‌లతో ఎంతో సాన్నిహిత్యం ఉందన్నారు. గౌడ కులస్తులకు తనవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తదనంతరం మంత్రిని గౌడ కులస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, మఠంపల్లి తహసీల్దార్ మంగారాథోడ్, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ గజ్జి చరమందరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్, సీనియర్ నాయకులు ఈడ్పుగంటి సుబ్బారావు, అల్లం ప్రభాకర్‌రెడ్డి, ఆదూరి కిషోర్‌రెడ్డి, గుండా బ్రహ్మారెడ్డి, లక్ష్మీవెంకటనారాయణ, కొండా నాయక్, బచ్చలకూరి బాబు, అరుణాసైదులు, సోములుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ సక్రు, అప్పారావు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు వల్లపుదాసు మహేష్‌గౌడ్, కాసాని ఎల్లయ్యగౌడ్, తాందార్‌పల్లి వెంకన్న గౌడ్, గౌడ కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.


అనంతగిరి : ఎత్తిపోతల స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అధికారులు

'రాజీవ్ ఎత్తిపోతల'ను త్వరగా పూర్తిచేయాలి

అనంతగిరి : రాజీవ్ ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం అనంతగిరి మండలం శాంతినగర్ వద్ద పాలేరు వాగుపై రూ.52 కోట్లతో నిర్మించే ఎత్తిపోతల పథకాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. వైఎస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన చేతుల మీదుగా ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా మండలంలోని ఏడు గ్రామాల్లో 3,129 ఎకరాలు, కోదాడ మండలంలో 1,781 ఎకరాలకు సాగు నీరు అందనుందన్నారు. ఆయన వెంట నీటి పారుదల శాఖ సీఈ రమేష్, ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ హిమబిందు, అధికారులు ఉన్నారు.


మఠంపల్లి : విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకకు హాజరైన గౌడ కులస్తులు, ప్రజలు

ఉగ్రవాదాన్ని మట్టుపెట్టడాన్ని సీపీఐ హర్షిస్తోంది


సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న రాష్ట్ర నాయకులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : పహల్గాంలో అమాయక పౌరుల ఉసురుతీసిన పాకిస్తాన్ ఉగ్రవాదులను ఆపరేషన్ సిందూర్ పేరుతో మట్టు పెట్టడాన్ని సీపీఐ హర్షిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. శనివారం చింతలపాలెంలో నిర్వహించిన సీపీఐ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత్ అంతర్గత విషయంలో ట్రంప్ జోక్యం చేసుకోవడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామని ఆయన తెలిపారు. దేశ సమైక్యత, సమగ్రత కాపాడటమే కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయ జోక్యం తగదని అన్నారు. చింతలపాలెంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జూన్ 8న సూర్యాపేటలో పార్టీ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలుత సీపీఐ జెండాను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తెల నారాయణరెడ్డి, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు, ఎస్‌టీయూ రాష్ట్ర నాయకులు బొమ్మగాని నాగభూషణం, సీపీఐ చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల కార్యదర్శులు రవి, పాపిరెడ్డి, నాయకులు గోనె అంకయ్య, జలాలుద్దీన్, మంగయ్య, రామారావు, శీను, హైమావతి, భద్రారెడ్డి, భీమిశెట్టి పద్మ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత న్యాయస్థానాల సేవలు అందరికీ అందుబాటులోకి తేవాలి

మునగాల : దేశంలోని సుప్రీంకోర్టు, హైకోర్టుల లాంటి ఉన్నత న్యాయస్థానాల సేవలను అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి తేవాలని మండలానికి చెందిన న్యాయవాది మిర్యాల మంగయ్యగౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన భారత రాష్ట్రపతికి ఈమెయిల్ ద్వారా లేఖ పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగయ్య గౌడ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్నత న్యాయస్థానాలు అన్ని వర్గాల ప్రజలు, అన్ని ప్రాంతాల ప్రజలకు అందుబాటులో లేవని, కేవలం ధనికులైన కేవలం పది శాతం మందికి మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. దేశప్రజలందరికీ ఉన్నత న్యాయస్థానాలు అందుబాటులోకి రావాలంటే సుప్రీంకోర్టు బెంచ్‌లను మూడు రాష్ట్రాలకు ఒకటి, హైకోర్టు బెంచ్‌లను మూడు జిల్లాలకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని కోరారు. దీనివల్ల దేశ ప్రజలందరికీ సుప్రీంకోర్టు, హైకోర్టుల సేవలు అందుబాటులోకి వస్తాయని, పెండింగ్ కేసులు త్వరతిగతిన పరిష్కారమవుతాయని తెలిపారు.

'ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులే'

కోదాడ : పేదలు, కార్మికుల పక్షాన నిరంతరం పోరాటాలు చేసేది కమ్యూనిస్టులేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల శ్రీనివాసరావు అన్నారు. శనివారం కోదాడలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన కోదాడ పట్టణ 4వ డివిజన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణ సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ లతీఫ్, పైడిమర్రి వెంకటనారాయణ, గోప్రానాయక్, సైదులు, రహిమాన్, సట్టు పార్వతి, అంజమ్మ, రేహానాబేగం పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి


హుజూర్‌నగర్ : శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ సైదానాయక్


చిలుకూరు : ఆర్పీలను సన్మానిస్తున్న ఎంఈఓ గురవయ్య, తదితరులు

హుజూర్‌నగర్ : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించే విధంగా ఉపాధ్యాయుల బోధన ఉండాలని ఎంఈఓ భూక్య సైదానాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, ఆర్‌పీలు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వృత్యంతర శిక్షణ

చిలుకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు నిర్వహించిన వృత్యంతర శిక్షణ శనివారం ముగిసింది. బెస్ట్ పార్టిసిపెంట్ ఉపాధ్యాయులను, శిక్షణ ఇచ్చిన ఆర్పీలను ఎంఈఓ ఎమ్. గురవయ్య సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, జీహెచ్‌ఎం గుజ్జుల నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని మండల విద్యాధికారి పుట్లూరి సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్, పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, ఆర్‌పీలు సత్యనారాయణరెడ్డి, శ్రీధర్, వెంకట్‌రెడ్డి, శ్రీనయ్య, షఫీ, రవీందర్‌రెడ్డి, కృష్ణరెడ్డి తదితరులు ఉన్నారు.

గరిడేపల్లి : ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న విషయాలు పాఠశాలల్లోని తరగతి గదుల్లో అమలు చేయాలని ఎంఈవో చత్రునాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీలో నిర్వహించిన వృత్యంతర శిక్షణ కార్యక్రమం ముగిసింది. అనంతరం ఎంఈవోను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాంబాబు, పాపయ్య, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, రాంబాబు, రవీందర్, సైదులు, సీఆర్పీలు అశోక్‌కుమార్, రామకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గిరిప్రసాద్ త్యాగం మరువలేనిది


నల్లమల గిరిప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దళ కమాండర్‌గా పనిచేసిన నల్లమల గిరిప్రసాద్ త్యాగం మరువలేనిదని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం సీపీఐ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు నల్లమల గిరిప్రసాద్ వర్ధంతిని హుజూర్‌నగర్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ధనుంజయనాయుడు, పోకల వెంకటేశ్వర్లు, కృష్ణ, రమేష్, శ్రీనివాస్, వెంకన్న, మామిడి వెంకయ్య, ఎస్.పద్మ, వై.ఉమ, సైదులు, స్టాలిన్, నరసయ్య, సురేందర్, గాంధీ, రమణ పాల్గొన్నారు.

ములకలపల్లి కుమారి మృతి బాధాకరం


మునగాల : కుమారి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సుదర్శన్‌రావు, తదితరులు

మునగాల : మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ములకలపల్లి రాములు సతీమణి కుమారి మృతి బాధాకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. శనివారం కొక్కిరేణిలో రాములును ఆయన పరామర్శించారు. తొలుత కుమారి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. రాములును పరామర్శించిన వారిలో భద్రాద్రి కొత్తగూడెం సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏ.జె.రమేష్, సీపీఎం జిల్లా నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు మిట్టగణుపుల ముత్యాలు, వట్టెపు సైదులు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకులు ఎస్‌డి.హుస్సేన్, సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి నందిగామ సైదులు ఉన్నారు.

ములకలపల్లి రాములుకు పరామర్శ

మునగాల : మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు సతీమణి కుమారి ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందారు. శనివారం ములకలపల్లి రాములును బీఆర్ఎస్ మఠంపల్లి మండల మాజీ అధ్యక్షుడు కోలాహాలం కృష్ణంరాజు పరామర్శించారు. తొలుత కుమారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం గ్రామశాఖ నాయకులు వట్టెపు సైదులు, నందిగామ సైదులు పాల్గొన్నారు.

అప్పయ్యకు సన్మానం


అప్పయ్యను సన్మానిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

గరిడేపల్లి : సీపీఐ గరిడేపల్లి మండల కార్యదర్శిగా ఎన్నికైన కడియాల అప్పయ్యను గానుగబండలో ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు పంగ సైదులు, మొండ లింగరాజు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎర్రజెండా నీ డలో పేద ప్రజల సమస్యల పరిష్కారానికి మరెన్నో పోరాటాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

వీరారెడ్డి మృతి తీరని లోటు


వీరారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్, తదితరులు

మునగాల : మండలంలోని కృష్ణానగర్ గ్రామానికి చెందిన వీరంరెడ్డి వీరారెడ్డి మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని బీఆర్ఎస్ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందిన వీరారెడ్డి దశదినకర్మ కృష్ణానగర్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి చిత్రపటానికి మల్లయ్యయాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు తొగరు రమేష్, కందిబండ సత్యనారాయణ, సుంకర అజయ్‌కుమార్, ఉడుం కృష్ణ, ఎల్‌పి.రామయ్య పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

గరిడేపల్లి : క్షయ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరమని మండల వైద్యాధికారి నరేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అబ్బిరెడ్డిగూడెం గ్రామాల్లో క్షయ వ్యాధి అనుమానిత లక్షణాలు ఉన్న 13 మందికి తెమడ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్.అంజయ్యగౌడ్, శ్రీనివాస్, ఉపేందర్, బుజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులపై దాడులు ఆపాలి


నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష ప్రజా సంఘాల నాయకులు

కోదాడ : ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీలపై దాడులను వ్యతిరేకిస్తూ శనివారం కోదాడ బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ బలగాలు అడవుల నుంచి వెనక్కి రావాలని కోరారు. అనంతరం ఇటీవల పోలీస్ కాల్పులలో మరణించిన మావోయిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు మరణించిన ఇతర మావోయిస్టులకు నివాళులర్పించారు. వారి మృతదేహాలను వెంటనే బంధువులకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వక్కంతుల కోటేశ్వరరావు, రాయపూడి చిన్ని, పందిరి నాగిరెడ్డి, దొడ్డా వెంకటయ్య, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, ముత్యాలు, జీఎల్ఎన్.రెడ్డి రవి, ఉదయగిరి, బాబునాయక్, నరసింహారావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం అంటగట్టిన నిందితుడి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ పరమేష్

మేళ్లచెరువు: నకిలీ బంగారం అంటగట్టి నిందితుడిని మేళ్లచెరువు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్ జిల్లా ఓసూర్ మండలానికి చెందిన హెచ్‌ఆర్ అశోక్‌తో పాటు మరికొందరు మేళ్లచెరువు మండలానికి వలస వచ్చి వ్యవసాయ బావుల వద్ద పిట్టలు పట్టుకుంటూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన ఇరిగెల శంభిరెడ్డితో పరిచయం పెంచుకున్నారు. కొద్దిరోజుల తర్వాత హెచ్‌ఆర్ అశోక్ తదితరులు తిరిగి తమ స్వగ్రామానికి వెళ్లిపోయారు. శంభిరెడ్డికి ఏప్రిల్ 30న హెచ్‌ఆర్ అశోక్ ఫోన్ చేసి తమ బంధువుల పొలం చదును చేస్తుండగా.. లంకెబిందెలు దొరికాయని, అందులో దొరికిన బంగారం ఎక్కడ అమ్మాలో తెలియడం లేదంటూ బంగారం ఉన్న వీడియోను శంభిరెడ్డికి చూపించాడు. డబ్బులు తీసుకొని వస్తే బంగారం ఇస్తామని ఏపీలోని హిందూపురానికి శంభిరెడ్డిని పిలిపించుకున్నారు. మొదట గ్రాము బంగారం ఇచ్చి అది మంచిదో కాదో చెక్ చేసుకొని డబ్బుతో రావాలని చెప్పారు. అది నిజమైనదే కావడంతో ఈ నెల 6న శంభిరెడ్డి రూ.3లక్షలు ఇచ్చి మరింత బంగారం తీసుకొచ్చాడు. ఇంటికి వచ్చి బంగారాన్ని పరీక్షించగా నకిలీదని తెలియడంతో 13న స్థానిక పోలీసులకు శంభిరెడ్డి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం తెల్లవారుజామున మేళ్లచెరువు మండల కేంద్రం శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితుడు హెచ్‌ఆర్ అశోక్‌ను పట్టుకొని విచారించగా నిజం ఒప్పుకున్నాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

హనుమాన్ మాలధారుల ఇరుముడి మహోత్సవం


ఇరుముడి ధరించి వెళ్తున్న హనుమాన్ మాలధారులు

మునగాల : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయంలో శనివారం హనుమాన్ మాలధారుల ఇరుముడి మహోత్సవం ఘనంగా జరిగింది. మండల, అర్ధమండల దీక్ష చేపట్టిన వీరికి శనివారం దేవాలయ అర్చకులు బొర్రా కృష్ణమాచార్యులు ఇరుముడి కట్టారు. ఇరుముడి ధరించిన మాలధారులు దీక్ష విరమించేందుకు ఎన్టీఆర్ జిల్లా తిరుమలగిరి తరలివెళ్లారు.

దేవాలయ కమిటీ ప్రమాణస్వీకారం


ఆలయ నూతన కమిటీ సభ్యులతో వంగవేటి రామారావు

మునగాల : మండలంలోని నరసింహాపురం గ్రామంలో గల పురాతన స్వయంభు శ్రీకోదండ రామస్వామి దేవాలయ నూతన కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం శనివారం ఆలయం ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు ముఖ్య అతిథిగా హాజరు కాగా, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఈఓ చలపతి, ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు సమక్షంలో ఆలయ కమిటీ చైర్మన్ గ్రామానికి చెందిన గుండు మధుసూదన్‌రావు, ధర్మకర్తలు కుక్కడపు రామకోటి, బాణాల శ్రీనివాసాచారి, బొమ్మ నాగేశ్వరరావు, సంద్ర లింగయ్య, రోజా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకుడు ముడుంబై శేషాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నూతన కమిటీని, ప్రధాన అర్చకుడిని వంగవేటి రామారావు, దేవాదాయ శాఖ అధికారులు సత్కరించారు. తదనంతరం వంగవేటి రామారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ శ్రీకోదండరామస్వామి దేవాలయానికి పూర్వ వైభవం తెచ్చేందుకు తాను శక్తివంచన లేకుండా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుండు వెంకయ్య, గుండు లక్ష్మీనారాయణ, బొమ్మ పెద్ద వెంకన్న, కారింగుల శ్రీను, కనమర్లపూడి శ్రీహరి, చెరుకు శివయ్య పాల్గొన్నారు.